క్లుప్తంగా

నేటి నుంచి వైద్య శిబిరాలు

కూనవరం: మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు కూనవరం పీహెచ్‌సీ డాక్టర్ సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. రోజుకు రెండు పంచాయతీల్లో వైద్య శిబిరాలు జరుగుతాయని. ఇందులో టీబీ స్క్రీనింగ్ టెస్ట్, సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్, మలేరియా, ఇతర రక్త పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 27న లింగాపురం, రేగులపాడు, 28న అభిచర, కూటూరు, 29న చినార్కూరు,పెదార్కూరు, 30న కొండ్రాజుపేట, కూనవరం, 1న జగ్గవరం, చూచిరేవులగూడెం, 2న మర్రిగూడెం, కరకగూడెం, 4న వెంకటాయపాలెం, టికుబాక, 5న కాచవరం,పోచవరం పంచాయతీల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వారపు సంత

అనంతగిరి: మండల కేంద్రంలోని వైఎస్సార్ కాలనీ వద్ద సోమవారం వారపు సంత జరుగుతుంది. మండలంలోని పలు గ్రామాల నుంచి గిరిజనులు సంతకు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకొస్తారు. సంతలో అల్లం, తేనె, బంతిపువ్వులు, కొండచీపులు, రాగులతో పాటు కూరగాయల అమ్మకాలు జరుగుతాయి. మైదాన ప్రాంత వ్యాపారులు సంతలో నిత్యావసర సరకులను విక్రయిస్తారు.

దుర్గ గుడి చైర్మన్‌పై హత్యాయత్నం దారుణం

గంగవరం: విజయవాడ కనకదుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబుపై హత్యాయత్నం దారుణమని నగర సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.త్రిమూర్తులు, ఉపాధ్యక్షులు వై.గోపాలకృష్ణ, కోశాధికారి ఎస్.శ్యాము, వెంకటేష్ తీవ్రంగా ఖండించారు. వారు విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. దుర్గగుడిని అభివృద్ధి పరచాలని ఉద్దేశంతో పారదర్శకంగా వ్యవహరిస్తున్న రాంబాబుపై ఓర్వలేక ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్సంగ్

కొయ్యూరు: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బూదరాళ్ల పంచాయతీ నల్లబిల్లిలో ప్రత్యేక పూజా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. నగర సంకీర్తన, సత్సంగ్, భజన నిర్వహించారు. బూదరాళ్ల పంచాయతీ సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ సాయి, పూజారి అప్పన్న, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన

చింతూరు: ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు సోమవారం చింతూరు, కూనవరం, వీఆర్ పురం ఎటపాక మండలాల్లో పర్యటిస్తారని అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చింతూరులో, మధ్యాహ్నం 12.30గంటలకు కూనవరంలో అసైన్డ్ భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొంటారు. వీఆర్ పురం మండలం రాజుపేటలో మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ సచివాలయం వద్ద టార్పాలిన్లు పంపిణీ , ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో పాల్గొంటారని , అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన సూచించారు.

నేడు శరభన్నపాలెంలో గడప గడపకు

కొయ్యూరు: శరభన్నపాలెం సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు ఆదివారం తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు. ఎంపీడీవో లాలం సీతయ్య మాట్లాడుతూ సోమవారం జరిగే గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్షకు స్పందన

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షను ఆదివారం నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ మార్కులు పొందిన 10 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. సంస్థ ప్రతినిధి ఎస్.రమేష్, జిల్లా సైన్స్ అధికారి కాళిదాస్, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగమంత చేయూత అందింది.. పేదల మోముల్లో చిరునవ్వు విరబూసింది. కష్టజీవులకు ఆర్థిక సాయం దొరికింది. అక్క, చెల్లెమ్మల ఆర్థిక స్వావలంబన కోసం నేనున్నానంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ చేయూత అండగా నిలుస్తోంది. ఈ పథకం అమలుతో చిరు వ్యాపారుల్లో ఆనందం వెల్లివిరిసింది. మహిళల వ్యాపారాల అభివృద్ధికి పాదం ముందుకు కదిలింది. వైఎస్సార్ చేయూత ఓ వరంలా ఆదుకుంటోందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జడ్డంగి గ్రామంలో వైఎస్సార్ చేయూత ద్వారా ఓ మహిళ ఏర్పాటుచేసుకున్న దుకాణాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు(ఫైల్)



వైఎస్సార్ చేయూత ద్వారా ఓ మహిళ ఏర్పాటు చేసుకున్న షాపును ప్రారంభిస్తున్న ఎంపీపీ గోము వెంకటలక్ష్మి (ఫైల్)

అక్క చెల్లెమ్మలకు 'చేయూత'



మహిళా సాధికారతకు ప్రాధాన్యం
వైఎస్సార్ చేయూత ద్వారా ఆర్థిక సాయం

రాజవొమ్మంగి: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బాటలు పడ్డాయి. అక్క, చెల్లెమ్మలు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకొని వారి కష్టంపై వారు గర్వంగా నిలబడాలని కుటుంబ పోషణలో వారి ప్రత్యేక స్థానం ఉండాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యోచించింది. అందుకు అనుగుణంగా మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ×వైఎస్సార్ చేయూత₹ పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థికంగా ఆదుకుంటున్నారు.

పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి

రాజవొమ్మంగి మండలంలో 59 గ్రామ సమాఖ్యల (వీఓలు) ఉండగా, 1,143 మహిళాశక్తి పొదుపు సంఘాలు (డ్వాక్రా సంఘాలు) ఉన్నాయి. వైఎస్సార్ చేయూత ద్వారా ఒక్కో లబ్ధిదారునికి ఏటా రూ.18,750ల చొప్పున జమ చేస్తోంది. మండలంలో సుమారు 2,600 కుటుంబాలు ఈ పథకం లబ్ధిపొందుతున్నాయి. ఏటా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.48,750,000లను లబ్ధిపొందారు. మండలంలోని వైఎస్సార్ చేయూత ద్వారా మూడు విడతల్లో రూ.14.62కోట్లను జమచేసింది.ప్రభుత్వం వైఎస్సార్ చేయూతతో పాటు బ్యాంకు ద్వారా రుణం అందజేసి ఆర్థికాభివృద్ధికి సాయమందిస్తోంది. బ్యాంకు ద్వారా రూ.75వేల కంటే ఎక్కువ రుణాన్ని అందజేస్తోంది. ఎటువంటి వడ్డీ చెల్లించనవసరం లేకుండా ఈ అప్పు నాలుగేళ్ళలో తీరిపోయేలా పక్కా ప్రణాళికను రూపొందించింది. కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా, పిల్లల చదువులకు ఆటంకం లేకుండా పేద, మధ్య తరగతి మహిళలు తమ సంసార నావను ముందుకు నడిపించేందుకు వైఎస్సార్ చేయూత ఒక వరంలా లభించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం: రాజవొమ్మంగి	
పంచాయతీలు 19	వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు రూ. 2,600
గ్రామాలు 62 జనాభా 40,000	ఒక్కో లబ్ధిదారుడికి ఏటా అందుతున్న సాయం రూ.18,750
మూడు విడతల ద్వారా పొందిన లబ్ధి రూ. 14.62 కోట్లు	

జగనన్నకు రుణపడి ఉంటాం



భార్యాభర్తతో పాటు మా కుటుంబంలో మేము ఆరుగురం. కూలీ నాలీ చేసుకొని జీవించే వారం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత ద్వారా మాకు లభించిన ఆర్థిక సహాయంతో చిన్న కిరాణా షాపు ఏర్పాటు చేసుకున్నాను. పథకం ద్వారా పొందిన సాయం కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా ఎంతగానో ఆదుకుంది. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం ద్వారా ఎంతో మేలు పొందుతున్నాం. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా మా వంటి పేద బడుగు బలహీనవర్గాల వారికి ఇటువంటి సహాయ సహకారాలు అందించలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మా కుటుంబమంతా రుణ పడి ఉంటాం.

– ఐనవిల్లి ఆశీర్వాదం, ఎస్సీ కాలనీ, రాజవొమ్మంగి.



మంచి చేస్తున్న జగనన్న

మహిళలు లక్షాధికారులు కావాలన్న ప్రభుత్వ లక్ష్యం అభినందనీయం. నిరుపేద మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ఒక వరం. పెద్ద మనసున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మాలాంటి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రభుత్వం అందించిన సాయంతో ఏర్పాటుచేసుకున్న నా దుకాణ వ్యాపారం ద్వారా కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా ఉంది. ఈ పథకం మా ఆర్థిక ప్రగతికి వారధిగా నిలుస్తోంది. మంచి చేస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– నాగులపల్లి అమ్మాజి, రాజవొమ్మంగి

పారదర్శకంగా ఎంపిక



ప్రతి సంవత్సరం ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ చేయూత పథకానికి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోంది. గత ఏడాది 2,611 మంది చేయూత పొందారు. ఈ ఏడాది నాలుగో విడత కోసం 2,771 మంది దరఖాస్తు చేసుకొన్నారు. గతంలో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా లబ్ధి పొంది వారి వివరాలు రెన్యూవల్ చేశాం. దీంతో పాటు కొత్తగా అర్హులను సచివాలయ సిబ్బంది సర్వే చేస్తున్నారు. అర్హులకు చేయూత అందించాలన్నదే ధ్యేయం అన్నారు.

– ఎల్.యాదగిరీశ్వరరావు.ఎంపీడీఓ.రాజవొమ్మంగి

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- అంబేడ్కర్‌కు ఘన నివాళి



అరకులోయ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



రేఖపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



చింతపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య

అరకులోయటౌన్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో భారత రాజ్యాంగకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగం ద్వారా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన సేవలను గుర్తు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, కాలేజీ ప్రిన్సిపాళ్లు తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. భారత రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. ప్రపంచ రాజ్యాంగాల్లో భారత రాజ్యాంగం పెద్దదని, 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 22 భాగాలుగా మూల రాజ్యాంగం ఏర్పడిందన్నారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని రాజ్యాంగాల్లో ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

అరకులోయలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, దండకారణ్యా జూనియర్ కళాశాలల్లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సిహెచ్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పుష్పరాజ్, చలపతిరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి, గిరిజన సంఘం ప్రతినిధులు సురేంద్ర, బాలదేవ్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని జరిగిన వేడుకల్లో స్థానిక రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ విద్యార్థులకు పెన్నులు, స్టేషనరీ సామగ్రి అందజేశారు. హెచ్ఎం గోపాల్, ఉపాధ్యాయులు జ్యోతి, కుమార్, అరవింద్ పాల్గొన్నారు.

రంపచోడవరం: మండలంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య, పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామస్నదొర, ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ, సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, ఎంఈవో కె.వి.వి.సత్యనారాయణ, పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కాపారపు రూతూ, దండంగి సింహాద్రి, దాకిలి నాగేశ్వరరావు, దళిత సమాజ్ సేవా సంస్థ, వనవాసి ధర్మ రక్షా సమితి, దళిత సంఘం నాయకులు రాజు , రామచంద్రరావు, వెంకట్, హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు బాలు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు.

అడ్డతీగల: స్థానిక జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), వార్డు సభ్యుడు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

వీఆర్ పురం: మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమీషన్ సభ్యుడు చిక్కాల బాలు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బి.సత్యనారాయణ, నాయకులు గౌతమ్, రాజు, ఉప సర్పంచ్ రాము, కార్యకర్తలు రాజారావు, శ్రీనివాసరావు, పోసి, సాయి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు అప్పనమ్మ, వెంకట్రావు, శకుంతల, హారతి, శైలజ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని గుండాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ శశికుమార్ వెంకట్, నాగేశ్వరరావు, సురేష్, రఘురాం, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



మారేడుమిల్లి బోదులూరు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బాబీ



చింతూరు కాలేజీలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



ఎటపాకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు, గ్రామస్తులు



కొయ్యూరులో విద్యార్థులకు స్టేషనరీ, పెన్నులు అందజేస్తున్న దాత సత్యనారాయణ



అడ్డతీగలలో క్విజ్ పోటీలో విజేతలకు విద్యార్థులకు బహుమతులిస్తున్న ఉపాధ్యాయులు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముంచంగిపుట్టు: మండలంలోని బాబుశాల పంచాయతీ మత్స్యపురం గ్రామంలో జెడ్పీ నిధులు రూ.1.20లక్షలతో నిర్మిస్తున్న తాగునీటి బోరును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబిరు జగబంధు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నేతలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగబంధు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. శివారు ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తోందన్నారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ పార్వతమ్మ, నేతలు అర్జున్, సాధురాం, సన్యాసిరావు, తిరుపతి, దేవా, పిత్‌బాస్, అప్పారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మత్యపురంతో చేతిబోరును ప్రారంభిస్తున్న నేతలు

3న ఏటీఏ మహాసభ

ఎటపాక: మండలంలోని నల్లకుంట ఆశ్రమ పాఠశాలలో వచ్చే నెల 3న ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కణితి శేఖర్ చెప్పారు. సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఉపాధ్యాయుల కొరత, ప్రత్యేక డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకం, ఏజెన్సీలో ఆదివాసీలకు ఉపాధ్యాయ అవకాశాలు తదితర అంశాలపై సభలో చర్చించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అన్ని వర్గాల పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజు, రామకృష్ణ, శ్రీశైలం, వినోద్‌కుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

ముమ్మరంగా తనిఖీలు

వై.రామవరం: వై.రామవరంలో ఆదివారం ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతుందని, అలాగే ఏఓబీలో మావోల కదలికలు ఉన్నట్టు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారిలో మీదుగా రాకపోకలు సాగిన వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులు అపరిచితులపై గట్టి నిఘా విధించారు. తనిఖీల్లో సిఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ ఆదనపు బలగాల పోలీసులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జాబ్ మేళా రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సాయి కుల్వంత్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కామరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులై 20 నుంచి 35 ఏళ్ల వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు.

నేడు శూలాల మహోత్సవం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని చౌడేశ్వరి సహిత సాంబమూర్తి శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సన్నాహాలు చేసింది.

సమస్యలపై వినతి

కొయ్యూరు: అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని మండల సీఆర్‌టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఆర్‌టీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సీఆర్టీలను రెగ్యులర్ చేయాలని కోరారు. దీనిపై ఎంపీ మాధవి సానుకూలంగా స్పందించినట్టు సీఆర్‌టీ సంఘం నాయకులు తెలిపారు.